



చిన్నారుల ప్రార్థనలు.. ఆధ్యాత్మిక సందేశమిస్తున్న ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మజీద్




ఈద్గా మైదానంలో దువా చేస్తున్న ముస్లింలు

సందడిగా ఈద్

వాడవాడలా ఘనంగా రంజాన్ వేడుకలు
కిటకిటలాడిన ఈద్గాలు, మసీదులు

గొడుగుల నీడన ప్రార్థనలు..



అనంతపురం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ముస్లింలు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకల్లా ఈద్గా మైదానాలకు చేరుకుని వజూ, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మజీద్ ఖురాన్‌లోని అంశాలను బోధించి, ముస్లింలతో ప్రార్థనలు చేయించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోస్‌మొ ద్దీన్‌తోపాటు పలువురు ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఈద్ ముబారక్(రంజాన్ శుభాకాంక్షలు) తెలుపుకున్నారు. ప్రార్థనల అనంతరం ఈద్గా నుంచి బయటకు వస్తున్న ముస్లింలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కూల్‌డ్రింక్‌లు పంపిణీ చేశారు. హెచ్చెల్సీ కాలనీలోని ఈద్గా మైదానం వద్ద ప్రార్థనల కోసం వచ్చిన ముస్లింల కోసం సీపీఎం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు కేఎం షఫివుల్లాను ఆయన నివాసంలో ముస్లింలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ఈద్గా మైదానంతోపాటు సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గా మసీదు, పాతూరులోని జంగాలపల్లి మస్జిద్, పిల్లిగుండ్ల కాలనీలోని ఈద్గా మైదానంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గా మైదానాలు, మసీదులు ముస్లింలతో కిక్కిరిసిపోయాయి.



రథోత్సవానికి హాజరైన జనం

రథంపై కొలువుదీరిన స్వామివార్లు

కసాపురంలో వైభవంగా రథోత్సవం

గుంతకల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ ఉత్సవాల్లో భాగంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివార్ల రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో నెట్టికంటి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేకాలంకరణలు చేశారు. ఉదయం నుంచి పూజాదికాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయం దక్షిణ గోపురం ఎదుట రథాన్ని ఉంచి సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి అలంకారాలు చేశారు. అనంతరం రథాంగ హోమాన్ని నిర్వహించి, బలిహరణ గావించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. నెట్టికంటి నామ స్మరణలతో భక్తులు పారవశ్యంతో రథోత్సవంలో పాల్గొన్నారు. ఆలయం వద్ద నుంచి గ్రామంలోని సీతారామ స్వామి ఆలయం వరకూ రథాన్ని లాగారు. కార్యక్రమంలో ఈఓ కె.వాణి, ధర్మకర్త కె. సుగుణమ్మ, ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

నెట్టికంటిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది ఉత్సవాలలో భాగంగా సోమవారం కసాపురం ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేను ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, నారాయణ, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, పత్తిపాటి చంద్ర పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో 211 పనులు రద్దు



ఏడాదిన్నర నుంచి బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు
రూ.8 కోట్ల వరకు పెండింగ్
జనవరిలో రూ.2.50 కోట్లు విడుదల
పెండింగ్ ఫైళ్లపై కమిషనర్ కసరత్తు

ప్రారంభంకాని, 25 శాతం పూర్తికాని పనుల నిలుపుదల

బిల్లుల కోసం కాంట్రాక్టర్లకు ఎదురు చూపే మిగిలింది. ఏడాదిన్నర నుంచి బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఈ ప్రభావం అటు నగరాభివృద్ధిపైనా చూపుతోంది. కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది జనవరిలో రూ.5 లక్షలలోపు బిల్లులు రూ.2.50 కోట్ల వరకు వచ్చాయి. ఆ బిల్లులు కాంట్రాక్టు వర్గాల్లో సంతృప్తినివ్వలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా పనులకు టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు వెనకడు వేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో నగరపాలక సంస్థలో దాదాపు 211 పనులు నిలిపివేశారు.



సాయినగర్ మొదటి క్రాస్‌లో ఆగిపోయిన పనులు

అనంతపురం క్రైం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నగరపాలక సంస్థలో బిల్లులు రాకపోవడం కాంట్రాక్టు వర్గాలను కలవరపెడుతోంది. ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి నెలకొంది. దాదాపు రూ.8కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల బిల్లులే అధికంగా ఉన్నాయి. జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేశారు. వీటిలో అధికంగా రూ.5లక్షలకుపైగా చేపట్టిన పనులే ఉన్నాయి. ఆ బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది జనవరిలో రూ.2.50 కోట్ల వరకు బిల్లులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లలో ఆ బిల్లులు పూర్తిస్థాయి సంతృప్తినివ్వ లేదు. అవి రూ.5లక్షలలోపు బిల్లులు మాత్రమే ఉన్నాయి. పెండింగ్ బిల్లుల్లో మార్చిలో పడతాయని భావించినా అది జరగలేదు.

● ఆ పనుల నిలిపివేత

నగరపాలక సంస్థ పరిధిలో తాజాగా 211 పనులను రద్దు చేస్తూ ఇంజనీరింగ్ విభాగాధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. వైసీపీ హయాంలో టెండరు పిలిచిన వర్క్‌లలో 25 శాతం కూడా పూర్తికానివి, అసలు ప్రారంభమే కాని వాటిని రద్దు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో నగరంలో ఒకేసారి అన్ని పనులను రద్దు చేశారు. నగరంలోని 50 డివిజన్లలో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు, కాంపౌండ్‌వాల్స్ తదితర పనులను చేపట్టకపోవడంతో పాతిక శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో వాటిని రద్దు చేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో బిల్లుల పెండింగ్ కూడా పనులు చేపట్టకపోవడానికి ఒక కారణంగా చెప్పొచ్చు. మరోసారి ఆ పనులకు అంచనాలు వేసి, టెండరు పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



పెండింగ్ ఫైళ్లపై కమిషనర్ దృష్టి

కొంతకాలంగా కార్పొరేషన్ కమిషనర్లు వరుసగా దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. అలా నాలుగు నెలల పరిధిలో నలుగురు కమిషనర్లు మారారు. కొందరు కీలక ఫైళ్లను పెండింగ్‌లో ఉంచిపోయారు. వారి పరిధిలోనే 300 నుంచి 400 వరకు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ప్రస్తుత కమిషనర్ బాలస్వామి వాటిపైనున్న దుమ్ము దులిచే పనిలో పడ్డారు. రికార్డు ప్రకారం అన్నీ సక్రమంగా ఉన్నా సంబంధిత ఫైళ్లు పెండింగ్‌లో ఉంచిపోవడం గత కమిషనర్ల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. పనులు పూర్తి చేసి, బిల్లు పెండింగ్‌లో ఉన్న ఫైళ్లపై ఆయన దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది.

● స్పెషల్ గ్రాంట్‌పైనా అయోమయం

గత ప్రభుత్వంలో స్పెషల్ గ్రాంట్‌గా వచ్చిన రూ.25కోట్ల నిధులపై అయోమయం నెలకొంది. ఆ నిధులతో మొత్తం 19 పనులకు టెండర్లు పిలిచారు. వీటిలో లెక్చరర్స్ కాలనీలో రూ.75 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, అశోక్ నగర్‌లో రూ.1.03 కోట్లతో సీసీ రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనుల్లో కొన్ని 40 నుంచి 70 శాతం వరకు అయ్యాయి. నిధులు ఆలస్యం కావడంతో సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ఆసక్తి చూపలేదు. సాయినగర్ మొదటి క్రాస్ నుంచి సూర్యానగర్ ప్రధాన రహదారి వరకు రూ.90 లక్షలతో సీసీ రోడ్డు విస్తరణ, డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. అది 50 శాతమే పూర్తయింది. ఈ నిధుల్లో కొంత జనరల్ ఫండ్ వాడుకున్నారనీ, ఆ నిధులను వీటికి జమ చేయడంలో అలసత్వం చేశారన్న విమర్శలున్నాయి. వీటికి సంబంధించి కూడా ఇంకా రూ.4 కోట్ల వరకు బిల్లులు పెండింగులో ఉన్నట్లు కాంట్రాక్టు వర్గాలు చెబుతున్నాయి.



రబీలో ఏడు మండలాల్లో కరువు

కీలక సమయాల్లో వర్షాభావంతో పంట నష్టం

జిల్లా అంతటా తగ్గిన పప్పుశనగ దిగుబడి
13 మండలాలకు దక్కని చోటు



అనంతపురం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో జిల్లాలోని ఏడు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ప్రకృతి వైపరీత్యాల విభాగం ఉన్నతాధికారులు కరువు మండలాల జాబితాను సోమవారం విడుదల చేశారు. జిల్లాలోని బెళుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి, విడపనకల్లు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. రబీ సీజన్‌లో జిల్లాలో 57వేల హెక్టార్లల్లో పప్పుశనగ సాగు చేశారు. కీలక దశల్లో వర్షం పడకపోవడంతో దిగుబడి భారీగా తగ్గింది. జిల్లాలోని 20 మండలాల్లో పప్పుశనగ పంట సాగు చేస్తున్నారు. పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, విడపనకల్లు, ఉరవకొండ, బెళుగుప్ప, బొమ్మనహాల్, కణేకల్లు, యాడికి, శింగనమల, పెద్దవడుగూరు, పామిడి, డి. హిరేహాల్, అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలాల్లో పప్పుశనగ పంట సాగు చేశారు. ఊడలు దిగేటప్పుడు, బుడ్డలు ఊరే సమయాల్లో వర్షాభావం వెంటాడింది. దీంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఏడు మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించడంతో మిగిలిన 13 మండలాల రైతులకు మొండిచేయి చూపినట్లయింది.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలి



రబీ సీజన్‌లో పప్పుశనగ పంట సాగు చేసిన అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలి. పంట కీలక దశల్లో వర్షాభావంతో దిగుబడులు రాలేదు. పంటకు అవసరం లేని సమయాల్లో కురిసిన వర్షాన్ని లెక్కలు తీసి కేవలం ఏడు మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించడం అన్యాయం. పప్పుశనగ సాగు చేసిన మిగిలిన అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి పంటనష్టపరిహారం అందించాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, కరువు నివారణ చర్యలు చేపట్టాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ఏడు మండలాలనే ప్రకటించడం దారుణం



జిల్లాలోని ఏడు మండలాలనే కరువు ప్రాంతాలుగా గుర్తించడం దారుణం. తద్వారా మిగతా మండలాల్లో పంటనష్టపోయిన రైతులకు తీరని అన్యాయం జరుగుతుంది. రబీ సీజన్‌లో అన్ని ప్రాంతాల్లో పప్పుశనగ పంట కీలక దశల్లో వర్షం పడకపోవడంతో దిగుబడులు రాలేదు. పప్పుశనగ సాగు చేసిన అన్ని ప్రాంతాల్లో పంట దిగుబడులు రాలేదు. కరువు మండలాల జాబితాపై ప్రభుత్వం పునరాలోచించి, పప్పుశనగ సాగు చేసిన అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలి.

- మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

సేవకు మారుపేరు

ఆర్యవైశ్యులు

రాష్ట్ర వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎంపీ

అనంతపురం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సేవకు మారుపేరు ఆర్యవైశ్యులు అని, ఎక్కడ విపత్తులు సంభవించినా సేవ చేసేందుకు తొలుత ముందుకొచ్చేది ఆర్యవైశ్యులేనని రాష్ట్ర వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని వైశ్య హాస్టల్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సాయంత్రం హాస్టల్ ఆవరణలో నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకలకు మంత్రి టీజీ భరత్‌తోపాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. హాస్టల్‌లో ఆధునికీకరించిన గదులను ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... వైశ్య హాస్టల్ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

క్రైం కార్నర్

గొర్రెల కాపరి ఆత్మహత్య


మారెన్న (ఫైల్)

కూడేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి కొన్న గొర్రెలు వింత వ్యాధితో చనిపోతుండటంతో మనస్థాపం చెంది కూడేరుకు చెందిన మారెన్న (44)అనే గొర్రెల కాపరి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మారెన్న అనే గొర్రెల కాపరి రూ.8 లక్షల విలువ చేసే 150 గొర్రెలను కొనుగోలు చేశాడు. గత కొన్ని నెలలుగా వింత వ్యాధి సోకి దాదాపు 90 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెలు మృతి చెందుతుండటంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక ఈ నెల 26న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కుంటెమ్మ, ముగ్గురు కుమారులు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి చేతిలో అన్న హతం

లేపాక్షి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడి చేతిలో అన్న మరణించిన సంఘటన లేపాక్షిలో జరిగింది. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన మేరకు లేపాక్షి గ్రామానికి చెందిన రామాంజనేయులు(45), అశ్వత్థప్ప అన్నదమ్ములు. రామాంజనేయులు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాలతో అన్నదమ్ములిద్దరూ తరచూ గొడవ పడేవారు. ఆదివారం కూడా ఇద్దరూ మద్యం సేవించి గొడవ పడ్డారు. ఈక్రమంలోనే అశ్వత్థప్ప తన అన్న రామాంజనేయులును మిద్దెపై నుంచి కిందకు తోసేశాడు. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును కుటుంబ సభ్యు లు ఆటోలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగి మృతి


శ్రీపతి (ఫైల్)

అనంతపురంరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామారుపల్లి సచివాలయంలో సంక్షేమ, విద్యాసహాయకుడిగా పనిచేస్తున్న మాసినేని శ్రీపతి (42) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. పిల్లిగుండ్ల కాలనీలో ఆయన నివాసముంటున్నారు. సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుత్రిలో మృతి చెందారు. ఆయన స్వగ్రామం రాప్తాడు మండలం పుల్లల రేవు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉద్యోగి మృతి పట్ల ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు ఇతర అధికారులు, సచివాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

మాజీ సర్పంచ్‌పై దాడి: ముగ్గురి అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో నాలుగో పట్టణ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. సీఐ సాయినాథ్ తెలిపిన వివరాల మేరకు... ఈనె 24న ప్రస్తుతం నగర శివారులోని మదర్‌థెరిస్సా కాలనీలో నివాసముంటున్న రాప్తాడు మండలం గాండ్లపర్తి కొత్తపల్లి మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి ఇంట్లోకెళ్లి ఆయనపై దాడి చేశారు. ఆయనకు తీవ్ర రక్తగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు సోమవారం దాడికి పాల్పడిన చింతపంటి సుధాకర్‌రెడ్డి, చింతపంటి దివాకర్‌రెడ్డితో పాటు వారికి పరోక్షంగా సహకరించిన వారి సమీప బంధువు చింతపంటి శివారెడ్డిని అరెస్ట్ చేశారు. శివారెడ్డి పాత నేరస్థుడు. ఇతడు ఎర్రచందనం, హత్య కేసుల్లో నిందితుడు. వారి నుంచి రెండు బైక్‌లు, రాడ్లను స్వాధీనం చేసుకున్నారు.

పాతాళ గంగ పైపైకి..!

- ఆశాజనకంగా భూగర్భజలాలు
- తొమ్మిది నెలల్లో 4 మీటర్లపైకి..

అనంతపురం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఈసారి వర్షాలు పుష్కలంగా కురవడంతో జిల్లాలో పాతాళ గంగమ్మ పైపైకి ఎగబాకుతోంది. గతంకంటే భూగర్భజలాల స్థాయి పెరిగింది. గత తొమ్మిది నెలల్లో జిల్లాలో భూగర్భ జలాలు సరాసరిగా 4 మీటర్ల పైకి పెరిగాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జిల్లాలో సరాసరిగా 461.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 601.9 మిల్లీ మీటర్లు నమోదైంది. 2024 మే నెలలో జిల్లాలో సరాసరిగా 15.22 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేవి. గతేడాది ఫిబ్రవరి నెలలో 12.29 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేవి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నాటికి 11.22 మీటర్ల లోతుకు భూగర్భజలాలు చేరుకున్నాయి. ఈ లెక్కన గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి జిల్లాలో సరాసరిగా 4 మీటర్లపైకి భూగర్భజలాలు పెరిగాయి. గత ఏడాది ఖరీఫ్‌లో అదనంగా వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు పెరిగాయి.

13 గ్రామాల్లో వ్యవసాయ బోర్లపై నిషేధం

జిల్లాలోని 13 గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ బోర్లు వేయడంపై ప్రభుత్వం నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని పుట్లూరు మండలం కోమటికుంట్ల, మడుగుపల్లి, తాడిపత్రి మండలం బోడాయిపల్లి, బొందలదిన్నె, హుసేనాపురం, సజ్జలదిన్నె, తాడిపత్రి రూరల్ ప్రాంతం, యల్లనూరు మండలం ఆరవేడు, బొప్పేపల్లి, మేడుకుర్తి, పెద్దమల్లేపల్లి, తిరుమలాపురం, వేములపల్లి గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ బోర్లు వేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతి ఏడాది అన్ని గ్రామాల్లో నీటి లభ్యత ఎంత ఉంది..? ఎంత నీరు వినియోగం అవుతుందన్న అంశాలపై పరిశీలన చేస్తారు. జిల్లాలోని 13 గ్రామాల్లో భూగర్భ జలాల నిల్వ కంటే అధికంగా నీటి వినియోగం అవుతున్నట్లు భూగర్భజల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయా గ్రామాల్లో వ్యవసాయ బోర్లు వేయకూడదని జీవో జారీ చేసింది.


భూగర్భ జలాల స్థాయిని లెక్కిస్తున్న అధికారులు (ఫైల్)

భూగర్భజలాలు పైకొచ్చాయి..



ఈసారి వర్షాలు బాగా కురవడంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు పైకొచ్చాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి జిల్లాలో సరాసరిగా 461.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 601.9 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు గతంతో పోలిస్తే పైకొచ్చాయి. జిల్లాలోని 13 గ్రామాల్లో నీటి నిల్వ కంటే అధికంగా నీటి వినియోగం జరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ బోర్లు వేయడంపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

-తిప్పేస్వామి, డీడీ, భూగర్భజల శాఖ

మండలాల వారిగా భూగర్భజలాల స్థాయి ఇలా...

మండలం పేరు	2024 మే	2025 ఫిబ్రవరి (మీటర్లలో)
అనంతపురం రూరల్	9.54	10.75
ఆత్మకూరు	7.69	6.43
బుక్కరాయ సముద్రం	5.72	9.02
బెళుగుప్ప	18.48	10.70
బొమ్మనహాల్	14.38	6.89
బ్రహ్మసముద్రం	17.78	13.93
డి.హిరేహాల్	23.06	14.73
గార్లదిన్నె	4.98	3.70
గుత్తి	12.59	11.28
గుమ్మగట్ట	27.97	11.85
గుంతకల్లు	6.46	6.61
కళ్యాణదుర్గం	23.59	15.40
కంబదూరు	16.43	8.95
కణేకల్లు	22.93	11.50
కూడేరు	12.43	11.65
కుందుర్పి	17.35	13.26
నార్పల	10.23	12.33
పామిడి	15.04	12.75
పెద్దపప్పూరు	2.29	0.87
పెద్దవడుగూరు	6.87	6.91
పుట్లూరు	26.28	16.46
రాప్తాడు	7.39	4.68
రాయదుర్గం	20.73	7.83
శెట్టూరు	38.51	28.92
శింగనమల	8.26	9.02
తాడిపత్రి	14.37	14.75
ఉరవకొండ	5.56	5.63
వజ్రకరూరు	11.34	9.51
విడపనకల్లు	4.42	7.06
యాడికి	26.68	19.26
యల్లనూరు	10.45	9.69

ఉత్సాహంగా ఎద్దుల బండ్ల పోటీలు

విడపనకల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండంలోని పొలికి, విడపనకల్లు, గ్రామాల్లో ఉగాది పండుగ సందర్భంగా ఎద్దుల బండ్ల పరుగు పందేలు, ఎద్దుల బండి గిరుకు లాగుడు పోటీలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విడపనకల్లులో ఊరి చివర ఎద్దుల బండ్ల పరుగు పందేలను నిర్వహించారు. ఈ పోటీలలో 9 జతల ఎద్దుల బండ్లు పాల్గొన్నాయి. నిర్దేశించిన దూరాన్ని ముందుగా చేరుకు జడప్ప ఎద్దులు మొదటి బహుమతి రూ. 5వేలను గెలుపొందాయి. రెండో బహుమతి రూ.మూడు వేలను వీరాంజి ఎద్దులు గెలుపొందాయి. మూడో బహుమతి స్టీల్ బకెట్‌ను ఎర్రిస్వామి ఎద్దులు గెలుపొందాయి.

పందెంలో అపశ్రుతి

ఎద్దుల బండ్ల పరుగు పందెంలో అపశ్రుతి చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న ఓ ఎద్దుల బండి పల్టీ పడింది. అందులో ఉన్న ఓ రైతు కింద పడిపోయి బయటికి వచ్చాడు. ఎద్దులను అదిలిస్తున్న రైతు చాక చక్యంగా బండి కాడిని పట్టుకుని కిందకు పడకుండా కూర్చున్నాడు. పరుగెడుతున్న ఎద్దుల బండిని ఎవరూ ఆపలేకపోయారు. కొద్ది దూరం వెళ్లాక ఎద్దులు ఆగిపోయాయి. దీనితో రైతులు అందరూ ఊరిపి పీల్చుకున్నారు. రైతు గనక జారి కింద పడి ఉంటే ప్రాణాలు పోయేవని వారు పేర్కొన్నారు.


ప్రథమ బహుమతి సాధించిన ఎద్దులతో రైతు


ఎద్దుల బండ్ల పరుగు పోటీ

- మండలంలోని పొలికి గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని గిరుకు బండి లాగుడు పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలలో ఏకల గురప్ప ఎద్దులు 4300అడుగులు దూరం గిరుకు బండిని లాగి ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి. రాయల మంజూ ఎద్దులు 3200 అడుగుల దూరాన్ని లాగి రెండో బహుమతిని, బోయ భీమేష్ ఎద్దులు 3049అడుగుల దూరాన్ని లాగి మూడో బహుమతిని గెలుపొందాయి.

నేటి నుంచే ఇంటర్ తరగతులు

అనంతపురం విద్య/కొత్తచెరువు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు వేసవి సెలవులకు ముందే కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1 నుంచి 2025-26 విద్యా ఏడాది తరగతులను నిర్వహించనున్నారు. సెకెండ్ ఇయర్ విద్యార్థులకు ఏప్రిల్ 1 నుంచి ఈనెల 23వ తేదీ వరకూ తరగతులు నిర్వహిస్తారు. 24 నుంచి మే 30 వరకూ వేసవి సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 1 నుంచి కొత్త విద్యా సంవత్సరం పునఃప్రారంభంకానుంది. ఈ నెల ఏడో తేదీ నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు ప్రారంభించనున్నారు. అడ్మిషన్ల నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించనున్నారు. టైం టేబుల్‌లో సైతం మార్పులు తీసుకొచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్లాసులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంటర్ విద్యలో ఇంటర్ బోర్డు సమూల మార్పులు తీసుకొచ్చింది. మంగళవారం నుంచి అన్ని జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమవుతాయని ఆర్ఐఓ వెంకటరమణ స్పష్టం చేశారు.

నేటి నుంచి రెండో ఉచిత సిలిండర్

అనంతపురం టౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దీపం-2 పథకం కింద మంగళవారం నుంచి రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకోవచ్చని ఇన్‌చార్జ్ డీఎస్ఓ జగన్నాథరావు ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5,05,831 మంది ఈ పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు పొందడానికి అర్హులుగా ఉన్నారన్నారు. తొలి సిలిండర్ బుకింగ్‌కు సోమవారంతో గడువు ముగిసిందన్నారు. రెండో సిలిండర్ ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరి వరకు పొందవచ్చని డీఎస్ఓ తెలిపారు. గ్యాస్ సరఫరా చేసిన వెంటనే డబ్బును ఆయా మహిళల ఖాతాల్లోకి జమ చేస్తామని పేర్కొన్నారు.

మనిషి చావుతో కుల రాజకీయాలు చేస్తారా..?

- ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీగా చేశారే... మీకేమైనా విజ్ఞత ఉందా..?
- ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్‌పై ఎమ్మెల్యే పరిటాల సునీత ఫైర్



అనంతపురం, మార్చి31(ఆంధ్రజ్యోతి): 'రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి ఘటనలో ఓ వ్యక్తి చనిపోతే కుల రాజకీయాలు చేస్తారా..? ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేశారే... మీకేమైనా విజ్ఞత ఉందా..?' అంటూ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సు నీత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.... పాపిరెడ్డిపల్లిలో ఓ వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం ఎంత బాధపడుతుందో తమకు బాగా తెలుసన్నారు. 'గతంలో నా భర్త, నా మామ, పరిటాల హరిని కోల్పోయిన నేపథ్యంలో మా కుటుంబమంతా కన్నీరుమున్నీరైంద'న్నారు. పాపిరెడ్డిపల్లి ఘటన చనిపోవాలని దాడిచేసింది కాదన్నారు. రాజకీయాలు, పార్టీలు, కులాలకు సంబంధమే లేదన్నారు. ఆ ఘటనను అడ్డుపెట్టుకుని పరిటాల కుటుంబాన్ని టార్గెట్ చేశారన్నారు. చనిపోయిన వ్యక్తి ఇంటిపేరు వదిలేసి ఆయన సామాజికవర్గాన్ని ప్రేరేపిస్తూ కురుబ లింగమయ్య అంటూ ఆ కులాన్ని రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో ప్రకాష్‌రెడ్డి ఆత్మకూరులో ఒకరు వ్యక్తిగత కారణాలతో హత్యకు గురైతే... దాన్నికూడా తమపై నెట్టారన్నారు. 15 ఏళ్లుగా కులాల్ని అడ్డం పెట్టుకుని, రాజకీయాలు చేయడం ప్రజలంతా గమనించారన్న విషయాన్ని ప్రకాష్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రాప్తాడులో సీటు కోసం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొడవలు పడుతూ ప్రతిదీ తమకు ఆపాదిస్తున్నారన్నారు. పరిటాల కుటుంబం పేరు చెబితేనే పెద్ద సైకో (జగన్) దృష్టిలో పడతామన్న ధ్యాస తప్ప... వారికి వేరే పని లేదన్నారు. వారి పార్టీలో ఏం చేసుకున్నా పర్వాలేదుకానీ... తమ కుటుంబానికి, పార్టీకి ప్రతిదీ అంటగట్టడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. కక్ష సాధింపులు అంటూ ప్రతిసారీ విమర్శలు చేస్తున్నారన్నారు. 'వైసీపీ గత ఐదేళ్లల్లో చేసిన వాటిని గుర్తుపెట్టుకొని ఉండుంటే.. మీరు ఒక్కరోజైనా తట్టుకొని ఉండేవారా' అన్నారు. ప్రకాష్‌రెడ్డి సోదరుడు... సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను పచ్చిబూతులు తిట్టాడన్నారు. తాము కక్ష సాధించాలనుకుంటే ఏమయ్యేవారో గుర్తెరగాలని సూచించారు. కురుబలు, బోయలు తమకు కుటుంబ సభ్యుల్లాంటి వారన్నారు. కులాలతో రాజకీయాలు చేయాల్సిన ఖర్మ తమకు పట్టలేదన్నారు. పాపిరెడ్డిపల్లి ఘటనలో తప్పు ఎవరిదైనా సరే... తమ బంధువులని తాము వెనకేసుకురాలేదన్నారు. ఇప్పటికే ఒకరిని అరెస్టు చేశారన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రాకుండా శవ, కుల రాజకీయాలు చేస్తారా అంటూ మండిపడ్డారు. బాధిత కుటుంబానికి సాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పరిటాల సునీత స్పష్టం చేశారు.

పాపిరెడ్డిపల్లిలో పోలీస్ పికెట్

- ఘర్షణలో గాయపడ్డ లింగమయ్య మృతి
- మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి నివాళి
- బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ రత్న

రామగిరి/చెన్నేకొత్తపల్లి/పెనుకొండటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో లింగమయ్య అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కాగా లింగమయ్య మృతదేహాన్ని సోమవారం అనంతపురం నుంచి పాపిరెడ్డిపల్లికి తరలిస్తుండగా ఎన్ఎస్‌గేటు సమీపంలో అంబులెన్స్‌ను ఆపి మృతదేహంపై పూలమాల వేసి చేనేత జౌళిశాఖ మంత్రి సవిత నివాళులర్పించారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లింగమయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం లింగమయ్య మృతదేహానికి పాపిరెడ్డిపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ రత్న ఆధ్వర్యంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచే పోలీసులు గ్రామంలోకి ఎవరిని రానివ్వకుండా పికెట్ ఏర్పాటుచేశారు. కేసును నిష్పక్షపాతంగా విచారణ చేస్తామని ఎస్పీ మృతుడి కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టడంతో పాటు పోలీసులు పికెట్‌ను కొనసాగిస్తున్నారు.

ఎన్ఎస్ గేటులో బందోబస్తు

చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ఎస్‌గేటులో సోమవారం పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఆదివారం టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగి వైసీపీ కార్యకర్త లింగమయ్య మృతి చెందాడు. లింగమయ్య మృతదేహాన్ని అనంతపురం నుంచి పాపిరెడ్డిపల్లికి తరలిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా బందోబస్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ రత్న ఎన్ఎస్‌గేటుకు చేరుకుని బందోబస్తును పర్యవేక్షించారు.


లింగమయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత


నివాళి అర్పిస్తున్న ఎంపీ


పాపిరెడ్డిపల్లిలో బందోబస్తుపై సమీక్షిస్తున్న ఎస్పీ రత్న

నిందితుల అరెస్టు

రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన ఘర్షణలో గాయపడిన లింగమయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రామాంజినమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదర్శ్, మనోజ్‌నాయుడును అరెస్టు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరిచారు. న్యాయాధికారి వారికి రిమాండ్ విధించినట్లు రామగిరి పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం : మంత్రి సవిత

రాజకీయ, వ్యక్తిగత కక్షల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని బీసీ, సంక్షేమ శాఖ మంత్రి సవిత సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తామని, రాజకీయ రంగు పులిమి ఘర్షణలు, అల్లకల్లోలం సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

మాజీ ఎంపీ మాధవ్ హౌస్ అరెస్టు


తన నివాసంలో గోరంట్ల మాధవ్, పోలీసులు

అనంతపురం క్రైం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లికి వెళ్లకుండా పోలీసులు సోమవారం హౌస్ అరెస్ట్ చేశారు. మీడియా ఎదుట మాధవ్ చేసిన వ్యాఖ్యలు కూడా ముందస్తు హౌస్ అరెస్ట్‌కు కారణమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య ఆదివారం హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం ఆ గ్రామానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లేందుకు గోరంట్ల మాధవ్ సిద్ధమయ్యారు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్.. సిబ్బందితో మాధవ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. అంతకుముందు మాధవ్ మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో రామరాజ్యం నడిచిందనీ, నేడు రాష్ట్రం రావణ కాష్టం అయిందన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజాసమస్యలను వదిలి వైసీపీ, ప్రజాస్వామ్య వాదులను అరెస్టులు, హత్యలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పాపిరెడ్డిపల్లికి వెళ్తానని పట్టుబట్టారు. పోలీసులు అలా కుదరదని చెప్పి హౌస్ అరెస్ట్ చేశారు.

ఆస్పత్రి ఆవరణలో పటిష్ట భద్రత

లింగమయ్య మృతదేహానికి పోస్టుమార్టం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి వద్ద టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ప్రధానంగా వైసీపీ నేతలు అక్కడికి వస్తే ఘర్షణ వాతావరణం తలెత్తే అవకాశముందని భావించిన పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అక్కడికి వస్తారని భావించిన నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు.


మార్చురీ గది వద్ద పోలీసుల భద్రత

ట్రెజరీలో చకచకా బిల్లులు

- ఉగాది, రంజాన్ సెలవు రోజుల్లోనూ కార్యకలాపాలు

అనంతపురం టౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో ఖజానా శాఖలో సందడి కనిపించింది. ఉగాది, రంజాన్ పండుగలు మార్చి నెలాఖరులో రావడంతో సెలవు రోజుల్లో కూడా ఆ శాఖ ఉద్యోగులు పనిచేయాల్సి వచ్చింది. ఆది, సోమవారాల్లో జిల్లాలోని ట్రెజరీ శాఖలు పనిచేశాయి. ప్రధానంగా కలెక్టరేట్‌లో ఉన్న ట్రెజరీ కార్యాలయం రెండురోజులుగా సందడిగా మారింది. గతంలో ప్రతి బిల్లూ ట్రెజరీల్లో పాస్ చేసి నేరుగా బ్యాంకులకు పంపించాల్సి ఉండేది. అపుడు సంబంధిత డబ్బును బ్యాంకులు ఆయా వ్యక్తుల ఖాతాల్లోకి జమచేసేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వచ్చిన బిల్లులను ట్రెజరీ పరిశీలించి ఆమోదం వేసి సీఎఫ్ఎంఎస్‌లోకి పంపుతుంది. అక్కడ వాటికి ప్రభుత్వం ఆమోదం వేస్తే.. బిల్లులకు బ్యాంకులు డబ్బులు విడుదలచేసి ఖాతాల్లోకి జమచేస్తాయి. ప్రస్తుతం కేవలం సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేయడమే కావడంతో ట్రెజరీ శాఖ సిబ్బంది నిరంతరాయంగా కార్యకలాపాలను కొనసాగించారు. అన్ని ప్రభుత్వ శాఖల నిధులు, వివిధ పథకాల పనులు, జీతాలు, అరియర్స్ బిల్లులకు సంబంధించిన బిల్లులు రావడంతో వాటిని పరిశీలించి ప్రభుత్వ ఆమోదం కోసం సీఎఫ్ఎంఎస్‌లోకి నమోదు చేసి పంపించామని ట్రెజరీ అధికారులు తెలిపారు.


అనంత కలెక్టరేట్‌లో రంజాన్ సెలవురోజు తెరచుకున్న ఖజానా కార్యాలయం

న్యూస్ బాక్స్

భక్తుల కొంగుబంగారం సల్లాపురమ్మ

● రేపు బండమీదపల్లిలో జాతర



ముస్తాబైన సల్లాపురమ్మ ఆలయం, (ఇన్‌సెట్‌లో) మూలవిరాట్

రాప్తాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లిలో వెలసిన గ్రామ దేవత సల్లాపురమ్మ దేవత భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటోంది. ప్రతి ఏడాది ఉగాది పండుగ అనంతరం మూడు రోజులకు సల్లాపురమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. అందులో భాగంగా బుధవారం నిర్వహించే జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్థులు తెలిపార. బుధవారం ఉదయం అమ్మవారికి పొట్టేళ్లు, మేకలు, కోళ్లను బలి ఇస్తారు. ఈ జాతరలో కుందేలు పార్వేటోత్సవం ప్రత్యేకం. బుధవారం సాయంత్రం 4 గంటలకు గ్రామస్థులంతా ఆలయం వద్దకు చేరుకుంటారు. అమ్మవారి దర్శనం తరువాత ఆలయ ప్రాంగణంలో పార్వేటోత్సవం నిర్వహిస్తారు. ఆ కుందేలును పట్టుకునేందుకు యువకులు ఉత్సాహంగా పోటీ పడతారు. రాత్రికి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సీతారామ కల్యాణం నిర్వహణపై సమావేశం

శింగనమల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రలో ఏప్రిల్ 11న జరిగే సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించాలని గ్రామస్థులు, కమిటీ సభ్యులు నిర్ణయించారు. సోమవారం శింగనమల ఆత్మారామస్వామి దేవాలయంలో సమావేశమయ్యారు. పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 11న ఒంటి మిట్ట తరహాలో సీతారామ కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు, ముత్యాల బియ్యం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సుబ్బరంగయ్య, లక్ష్మణరావు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

నార్పల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులుసల నూతల గ్రామంలో చిట్టీ డబ్బు విషయంపై జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. గ్రామ సరిహద్దులో ఉన్న పెద్దమ్మ గుడి వద్ద ఆదివారం రాత్రి గ్రామ పొత్తుల చిట్టీ నిర్వహించారు. చిట్టీ డబ్బును గుడికి కేటాయిద్దామని గ్రామానికి చెందిన రామాంజనేయులు అన్నాడు. దీనిపై మల్లికార్జున విభేదించాడు. వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మల్లికార్జున అతడి అనుచరులు నలుగురు కోపాద్రికులై రామాంజి నేయులుపై దాడి చేశారు. గాయపడిన రామాంజినేయులును నార్పలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై రామాం జినేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఆశా కార్యకర్తకు ఆర్థిక సాయం

శింగనమల, మార్చి31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆశా కార్యకర్త పద్మావతిని రాష్ట్ర సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పరామర్శించారు. ఆయనతో పాటు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు నాగభూషణ, నాయకులు భారతి, మురళి, ప్రమీల, ఎర్రిస్వామి సోమవారం శింగనమలలోని పద్మావతి ఇంటికి వెళ్లారు. ఆమెను పరామర్శించి, మెరుగైన చికిత్స కోసం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పద్మావతి కోలుకునే వరకు ప్రతి నెల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాలిపోయిన మామిడితోట పరిశీలన

అనంతపురం రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు గ్రామంలో అగ్నికి ఆహుతైన మామిడితోటను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గ్రామానికి చెందిన బూడిద నాగేంద్రకు చెందిన మామిడితోటకు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తహసీల్దార్ మోహన్‌కుమార్ తదితరులు తోటను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ... రైతుకు న్యాయం జరిగేలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తా మన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరమెట్ల ఎల్లన్న తోటను పరిశీలించి నిప్పుపెట్టిన వారిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం శిక్షించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్న గొర్ల సాయినాథ్‌రెడ్డి, వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఈఓ శ్రావణి, చియ్యేడు కృష్ణారెడ్డి, రమేస్, విద్యార్థి నాయకుడు నగేష్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, నరసింహులు, ఆదెన్న, నల్లప్ప పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

నార్పల, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త హనుమంతరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మరణించారు. విషయాన్ని తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు ఆయన స్వగృహానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడు లోకనాథ్‌రెడ్డి, కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెప్పారు. నాయకులు పిట్టు రంగారెడ్డి, ఎర్రినాగప్ప, తలారి కుళ్లాయప్ప, నాగేంద్ర, కేశవరెడ్డి, శ్రీరాములు, వెంకటనారాయణ, ఆది, భాస్కర్, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆనంద్, నిర్మల కుటుంబ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అన్ని మతాల సారాంశం సేవ మార్గమేనని, సేవతోనే జీవితం సార్థకం అవుతుందని సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ పేర్కొన్నారు. హిందువుల ఉగాది, ముస్లింల రంజాన్, క్రైస్తవుల ఉపవాస దినోత్సవం మూడు పండుగలు వరుసగా రావడంతో చిన్నయనగర్‌కు చెందిన ఆనంద్, నిర్మల దంపతుల ఆర్థిక సాయంతో సాయిట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజనాసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. పేదలకు అన్నదానం చేసే అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉందని, మూడు పండుగలు కలిసి ఒకేచోట జరుపుకోవడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు సభ్యులు మాధురి, మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఈద్గా వెలుపల ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ అంబికా



గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొయిద్దీన్‌కు పలువురి శుభాకాంక్షలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మసీదులు, ఈద్గా మైదానాల్లో మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీ, హెచ్చెల్సీ కాలనీల్లో ఈద్గామైదానాల్లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నా ప్రార్థనలు చేశారు. అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి, సిండికేట్ నగర్, కక్కలపల్లి, అక్కంపల్లి, చియ్యేడు, ఉప్పరపల్లి, కందుకూరు తదితర గ్రామాల్లో ముస్లింలు సంబరంగా పండుగను జరుపుకున్నారు. గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె, కల్లూరు, మర్తాడు, కోటంక, బూదేడు, పెనకచెర్ల డ్యాం తదితర గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలు జరుపుకున్నారు. కల్లూరులోని జామియ, మదీన, బిలాల్, అబుబు బకార్ మసీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాసాలు విరమించారు. రాప్తాడు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చెన్నేకొత్తపల్లి, మండలంలో పవిత్ర రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఎన్‌ఎస్‌గేటు, సీకేపల్లిల్లో ముస్లింలు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి ఈద్గామైదానాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కనగానపల్లి మండలంలోని తగరకుంట, మామిళ్ళపల్లి, కుర్లపల్లి, నరసంపల్లి, తూంచెర్ల తదితర గ్రామాల్లో, రామగిరి మండలంలోని పేరూరు, రామగిరి, గంగంపల్లి, మాదాపురం, కుంటిమద్ది, పోలేపల్లి గ్రామాల్లో ముస్లింలు రంజాన్ ప్రత్యేక ప్రార్థలు చేశారు.



రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎన్‌ఎస్ గేటులో నల్లబ్యాడ్జీలతో ఈద్గామైదానం వద్ద ముస్లింలు



కల్లూరులో ప్రార్థనలు చేసేందుకు వెళ్తున్న ముస్లింలు



నార్పలలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రామగిరిలో...

చమన్ ఇంటికి ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్



చమన్ సాబ్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకొని సోమవారం స్థానిక రాంనగర్‌లోని జడ్పీ మాజీ చైర్మన్ చమన్ సాబ్ ఇంటికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌లు వెళ్లారు. చమన్ సాబ్ భార్య రమీజా, కుమారుడు ఉమర్‌ముక్తార్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చీనీ టన్ను రూ.26వేలు

అనంతపురం రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 13వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 493 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

స్లాట్ బుకింగ్‌పై అవగాహన

అనంతపురం క్రైం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్‌పై జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించా రు. నగరంలోని రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈనెల 4వతేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి వస్తుందన్నారు. సబ్‌రిజిస్ట్రార్లు రమణరావు, యూనస్‌లు ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లతో సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎలా స్లాట్‌బుక్ చేసుకోవాలనే విషయంపై వివరించారు.

వైకుంఠం ప్రభాకర్ చౌదరికి సన్మానం



ప్రభాకర్ చౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవల విభాగంలో కళారత్న (హంస) అవార్డు అందుకున్న అవే సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరిని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకున్న ఆయన సోమవారం నగరానికి చేరుకున్నారు. టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక రాంనగర్‌లోని ఆయన నివాసంలో కొందరు నాయకులు గజమాలతో సత్కరించారు. మరికొందరు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మాజీ మేయర్ గంపన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, వసుంధర, రాములమ్మ, ఫక్రుద్దీన్, చెరుకూరి శివ, రామసుబ్బయ్య, రవినాయుడు, సంజీవులు, విజయ్‌బాబు, సుస్నీం శీనా, రంగా, వెంకటేష్ చౌదరి, నెట్‌కాన్ చంద్ర, కుళ్లాయప్ప, మురళి తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

3న ఉచిత కంటి వైద్యశిబిరం

రామగిరి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో ఏప్రిల్ 3వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు గ్రామానికి చెందిన రామ్మూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

● ముగ్గురు స్టాఫ్ నర్సులకుగాను ఒక్కరే..
● డెప్యుటేషన్‌పై ఫార్మసిస్ట్
● గార్లదిన్నె పీహెచ్‌సీలో దుస్థితి
● పట్టించుకోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ



గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గార్లదిన్నె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వైద్య సేవలందించాల్సిన వైద్య ఆరోగ్య శాఖను సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది. మండలంలోని గార్లదిన్నె, యర్రగంట్ల గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) ఉన్నాయి. ఒక్కొక్క పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులతో పాటు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉంది. అయితే ఈ రెండు పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు చొప్పున ఉన్నారే గానీ స్టాఫ్ నర్సుల కొరత ఉంది. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రమైన గార్లదిన్నె పీహెచ్‌సీ విషయానికి వస్తే... ఇందులో గౌతమి, మంజుల అనే ఇద్దరు వైద్యులు ఉన్నారు. కానీ ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు స్టాఫ్ నర్సులలో ఏడాది కిందట ఒకరు రాజీనామా చేయగా, మరొకరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం శోభ అనే ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆమె లేని సమయంలో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవర్ హెల్త్ ప్రొవైడర్)తో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తే వారికి కేటాయించిన గ్రామాల్లో వైద్య సేవలు బంద్ అవుతున్నాయి. అదేవిధంగా గత కొంతకాలంగా ఎఫ్ఎన్ఓ పోస్టు ఖాళీగా ఉంది. ఫార్మసిస్టు ఎనిమిది నెలలు కిందట డిప్యూటేషన్‌పై జిల్లా జైలుకు వెళ్లా రు. జైలులో మూడు రోజులు, గార్లదిన్నె పీహెచ్‌సీలో మూడు రోజులు విధులు నిర్వహిస్తున్నారు. ఫార్మసిస్టు స్థానంలో హెల్త్ అసిస్టెంట్ ద్వారా రోగులకు మందులు పంపిణీ చేయిస్తున్నారు. అయితే 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న గార్లదిన్నె పీహెచ్‌సీ ఉంది. దీంతో ప్రమాదాల్లో గాయపడి ఈ పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకునే వారు నిత్యం ఉంటారు. సిబ్బంది కొరత కారణంతో ఇటు వైద్యులు...అటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కొరత ఉండడంతో రోగులు పెద్దగా పీహెచ్‌సీ కి రావడం లేదని పలువురు మాట్లాడుకుంటున్నారు. ప్రమాదాలు ఏమైనా జరిగితే అంతే సంగతి అంటున్నారు. నిత్యం వివిధ గ్రామాల ప్రజలు ఈ పీహెచ్‌సీకి వైద్య చికిత్సల కోసం వెళతారు. అయితే ఫార్మసిస్టు బదులు మరొకరు మందులు ఇస్తుండడంతో ప్రజలు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు రాసిచ్చిన మందులకు బదులు మరొకటి ఇస్తే తమ పరిస్థితి ఏంటని భయపడుతున్నారు. దీంతో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు రోగులు వెనకడుగు వేస్తూ ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నారే తప్ప పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరతను తీర్చ మని కోరినా ఎవరూ పట్టించుకోవడం లే దనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమే. అయినా పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలందిస్తున్నాం. స్టాఫ్ నర్సులు తగినంత మంది లేకపోయినా, ఉన్న ఒక్క స్టాఫ్ నర్సుతో పాటు ఎల్‌ఎంహెచ్‌పీలు విధులు నిర్వహిస్తు న్నారు. సిబ్బంది కొరత ఉన్నట్లు ఉన్నతాధి కారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినాం.
- గౌతమి, వైద్యాధికారి, గార్లదిన్నె పీహెచ్‌సీ



రోగికి ఇంజెక్షన్ వేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ



రోగులకు మందులు ఇస్తున్న హెల్త్ అసిస్టెంట్

జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌కు ఘన స్వాగతం



మంత్రి టీజీ భరత్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌కు టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నగరంలోని ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సోమవారం వచ్చిన ఆయన్ను స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, నాయకులు సుందర్, తాటి మధు, కృష్ణం రఘు, సిరిశాల రాంబాబు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నేడు పదో తరగతి సోషల్ పరీక్ష

అనంతపురం విద్య, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విషయం తెలియజేయాలని సూచించారు.

ఘనంగా పార్వేట ఉత్సవం



లక్ష్మీచెన్నకేశవస్వామి, నారాయణస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రాప్తాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట గ్రామంలో సోమవారం ఘనంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. పార్వేట సందర్భంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి, నారాయణస్వామి విగ్ర హాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. యర్రగుంట, బండమీదపల్లి గ్రామాల్లో భక్తులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో పన్నేరపు బండ్లు కట్టి దేవాలయాల చుట్టూ తిప్పారు. అనంతరం గ్రామ శివార్లలో కుందేలు పార్వేట ఉత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ముగిసిన అక్కదేవతల ఉత్సవాలు



కుంకాలు చల్లుకుంటున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటికొండ గ్రామంలో నాలుగు రోజుల నుంచి వైభవంగా జరుగుతున్న అక్కదేవతల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా కుంకాలు చల్లుకునే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు బారీగా తరలివచ్చా రు. అక్కదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పరుషలో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద భక్తుల సందడి కనిపించింది.

హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● సీఐకి కురబ సంఘం నాయకుల వినతి



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న కురుబ సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురబ లింగమయ్యను హత్య చేసిన వారనికి కఠినంగా శిక్షించాలని చెన్నేకొత్తపల్లి సీఐని కురబ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం రామగిరి పోలీసు స్టేషన్‌లో సీఐ భాస్కర్‌నాయుడుకు కురబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, ఆ సంఘం నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, కేసీ నాగన్న, కృష్ణమూర్తి, వెంకటేష్ వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... కురబ లింగమయ్య ఏ పార్టీకి సంబంధం లేని వ్యక్తి అన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న వ్యక్తిని అత్యంత దారుణంగా హత్య చేయడం దుర్మార్గమన్నారు. ఆయన హత్యను రాజకీయాలకు అంటగట్టడం సరికాదన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకులైనా హత్యారాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. నాయకులు తమ స్వార్థ రాజకీయాలు మానుకొని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కురబ లింగమయ్యను హత్య చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి కురబ సంఘం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.

● రామగిరి: లింగమయ్య హత్యకేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కురుబ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు సీఐ శ్రీధర్‌ను కోరారు. ఆయన బుధవారం స్థానిక స్టేషన్‌లో సీఐని కలిశారు. అంతేకాకుండా లింగమయ్యపై దాడికి పాల్పడిన మరికొందరిని ఈ కేసులో నిందితులుగా చేర్చాలని సీఐకి వినతిపత్రం అందజేశారు.

మత సామరస్యాన్ని చాటిన చియ్యేడు ముస్లింలు



చియ్యేడు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనంతపురంరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని చియ్యేడు ముస్లింలు మత సామరస్యాన్ని చాటారు. గ్రామంలో ఉగాది, శ్రీరామనవమి, వనభోజనాలు, గంధం పూజ పూర్తయ్యే వరకు మాంసాహారం తినకూడదని పెద్దలు నిర్ణయించారు. ఆ మేరకు గ్రామంలోని ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగ అయినప్పటికీ మాంసాహారం తినకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ముస్లింలు తీసుకున్న నిర్ణయంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటర్వ్యూ..

ఆస్పత్రిలో చాలా ఆపరేషన్లు చేస్తున్నాం

● డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, గుంతకల్లు



గుంతకల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య ఏరియా ప్రభుత్వాస్పత్రిలో నెలకొని ఉన్న సమస్యలపై సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డిని ఆంధ్రజ్యోతి సోమవారం ఇంటర్వ్యూ చేసింది. పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలియజేశారు.

ప్రశ్న: ప్రభుత్వాసుపత్రిలో సిజేరియన్లు తప్ప మిగతా జనరల్ సర్జరీలు జరగడం లేదని ఆరోపణలున్నాయి. మీ సమాధానం..?

జవాబు: సిజేరియన్లు, గర్భసంచి ఆపరేషన్లేకాకుండా శరీరంలో ఎక్కడైనా వచ్చే గడ్డలు, హెర్నియా, హైడ్రోసీల్ తదితర ఆపరేషన్లు చేస్తున్నాం. థైరాయిడ్ లాంటి ఆపరేషన్లు మాత్రమే చేయడం లేదు.

ప్రశ్న: ఎంఆర్ఐ, సిటీ స్కాన్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు ప్రతిపాదన ఏమైంది?

జవాబు: ఎంఆర్ఐ- సిటీ స్కాన్ యంత్రాల అవసరం ఉందా.. అంటూ వైద్య శాఖ అడిగిన మేరకు ప్రమాదాల కేసుల్లో వాటి అవసరం ఏర్పడుతోందని సమాధానం పంపాము. ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

ప్రశ్న: బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి?

జవాబు: అలా అని నావద్దకు ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా వచ్చి నాకు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాను.

ప్రశ్న: ఆస్పత్రి ఏఓ మహిళా ఉద్యోగులపై అనుచితంగా ప్రవర్తించారంటూ ఆరోపణలు రాగా, రెండు దఫాలుగా అంతర్ జిల్లా అధికారుల బృందాలు వచ్చి విచారణ చేసి వెళ్లాయి. మూడు నెలలు దాటినా ఎటువంటి రిపోర్టు రాలేదెందుకు?

జవాబు: నిజమే.. రెండు సార్లు విచారణ జరిగింది. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదు. మొన్నటిదాకా లాంగ్ లీవులో ఉన్న ఏఓ కొన్ని రోజుల కింద వచ్చి డ్యూటీలో జాయిన్ అయ్యి మరలా లీవులో వెళ్లారు. విచారణపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కమ్యూనిస్టు నేత రంగన్నకు ఘన నివాళి

ఉరవకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ నేత తమ్మినేని రంగన్న 7వ వర్ధంతిని సోమవారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రకరూరు మండలం చాయపురంలో ఉన్న ఆయన స్మారకస్థూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఉరవకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ రంగన్న ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. రంగన్న కుమారుడు రాజశేఖర్, నాయకులు మల్లికార్జున, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా మైదానంలో బాలుడి అదృశ్యం

● గంటలోపే ఆచూకీ కనుగొన్న పోలీసులు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

గుత్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈద్గా మైదానంలో సోమవారం లాలూ ఖాసీం అనే ఐదేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు గంటలో బాలుడి ఆచూకీ కనుగొన్నారు. తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామానికి చెందిన జులేఖా, యూసుఫ్‌బాషా దంపతులు తమ కుమారుడు లాలూఖాసీంతో కలిసి పెద్దవడుగూరు మండలం కాశేపల్లిలోని బంధువుల ఇంటికి రంజాన్ పండుగకు వచ్చారు. ప్రార్థనల కోసం ఆ బాలుడు మేనమామ కమాల్‌బాషాతో కలిసి గుత్తిలోని ఈద్గా వద్దకు వెళ్లాడు. ప్రార్థనల అనంతరం బాలుడు కనిపించలేదు. కమాల్‌బాషా అక్కడే పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో వెంటనే బాలుడి తల్లిండ్రులకు విషయం తెలిపి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి అనంతపురం రోడ్డులోని ఓ హోటల్ వద్ద బాలుడు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్టేషన్‌కు పిలుచుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. గంటలోపే బాలుడి ఆచూకీ కనుకొన్నందుకు అందరూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హనుమంతు, కుళ్లాయప్ప, సుధాకర్, బ్లూకోర్టు సిబ్బంది శ్రీనాథ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగల మూట మాయం సంగతి.. ఇక అంతేనా?

● పది రోజులైనా.. బాధ్యులపై చర్యలు శూన్యం

ఉరవకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన నగల మూట మాయం ఘటన కంచికేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటన వెలుగులోకి వచ్చి పది రోజులు కావస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ నెల 18వ తేదీన ఆలయ ఆవరణలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ సొమ్మును లెక్కించారు. లెక్కింపు తర్వాత బంగారు కానుకలు ఎందుకు లెక్కించలేదని అర్చకుడు ప్రశ్నించడంతో నగల మూటలో సిబ్బంది చేతి వాటం ప్రదర్శించిన విషయం వెలుగులోకి వచ్చింది. స్వయాన ఆర్థిక మంత్రి ఈఘటనపై సీరియస్‌గా పరిగణించారు. కలెక్టర్‌కు ఫోన్ చేసి సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. అయినప్పటికీ అధికారులలో చలనం లేదు. ఈ ఘటనపై దేవాదాయ శాఖ జిల్లా అధికారి ఆదిశేషనాయుడు, తహసీల్దార్ మహబూబ్‌బాషా నివేదికను అందజేశారు. ఇద్దరు అధికారుల నివేదికలు పొంతన లేకుండా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నగల మూట దొరికిన రోజే ఆలయ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమివ్వకుండా గోప్యంగా ఉంచారు. ఆ నగల మూటను మరలా హుండీలోకి వేసి చేతులు దులుపుకున్నారు. నగల మూటను హుండీలోకి వేస్తున్న వీడియోను ఆలయ అధికారులు గ్రూపు ల్లో పోస్టు చేసి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధులకు రావద్దని చెప్పేసి ఈ ఘటనలో తమకేమీ సంబంధం లేదని చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఆలయంలో ఇటీవల భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. దేవాలయానికి రూంల బాడుగలు, అన్నదాన విరాళాల్లో రశీదులు ఇవ్వకుండానే డబ్బులు తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఇలాంటి ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయంపై అసిస్టెంట్ కమిషనర్‌ను వివరణ కోరగా నివేదికను ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

రూ1.40 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం



నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు

ఉరవకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నుంచి గుంతకల్లుకు వెళ్లే రోడ్డు ప్రస్తుతం చాయాపురం-కొనకొండ్ల మధ్య అద్దంలా కళకళలాడుతోంది. కొంతకాలం క్రితం వరకు ఆయా గ్రా మాల మధ్యలో రోడ్డు మట్టితో కూడి తీవ్ర గుంతలమయంగా ఉం డేది. ప్రయాణాలు సా గించాలంటే ఆ ప్రజలు నరకం చూసేవారు. ఆ రోడ్డులో గుంతల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతుండేవి. ఐదేళ్ల పాలనలో ఆ రోడ్డు గురించి పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం రాగానే ఆయా గ్రామస్థులు రోడ్డు సమస్యను మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి వెంటనే స్పందించి కొత్తరోడ్డు నిర్మాణానికి రూ1.40కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో కొనకొండ్ల నుంచి చాయాపురం వరకూతో బీటీ రోడ్డును నిర్మించారు. రహదారి నిర్మాణం పనులు పూర్తికావడంతో ఆయా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంతకల్లులో ఈద్గా వద్ద ముస్లింను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



కళ్యాణదుర్గంలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



తాడిపత్రిలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డితో ముస్లిం మతపెద్దలు



ఉరవకొండలోని ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

● ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజవకర్గాల వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఉదయమే ముస్లింలు కలిసి కట్టుగా సమీపంలోని ఈద్గా మైదానాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశా రు. అలాగే మసీదుల్లోనూ ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు, ప్రభుత్వ ఖాజీలు మాట్లాడుతూ.. ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ అని పేర్కొన్నారు. వర్షాలు బాగా కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. తర్వాత ఇళ్లకు బంధుమిత్రుల ను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. పేదలకు పలు దానాలు చేపట్టారు. గుంతకల్లు పట్టణంలో ఈద్గా మైదానం వద్ద ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు తదితరులు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కళ్యాణదుర్గం పట్టణంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. ఈద్గా అభివృద్ధికి సొంత నిధులు రూ.5 లక్షలు ఇచ్చానన్నారు. అదేవిధంగా షాదీమహల్ అభివృద్ధికి కూడా రూ.10 లక్షలు సొంతనిధులు ఇచ్చానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు తీసుకువచ్చి ఈద్గాలు, మసీదులను అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. ఇక తాడిపత్రిలో తమ నివాసానికి వచ్చి కలిసిన ముస్లిం మతపెద్దలకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, టీడీపీ నేత జేసీ పవన్‌రెడ్డి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.



పామిడిలో..



రాయదుర్గంలో..



కణేకల్లులో..



కూడేరులో..



కంబదూరులో..

కమనీయం.. కొత్త వెంకటరమణుడి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాడికి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాయపల్లి సమీపంలో గల కొత్త వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం లక్ష్మీదేవి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ సాంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్థులతో పాటు యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, నంద్యాల జిల్లా ప్యాపిలి, అవుకు మండలాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుడి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పెద్దవడుగూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది పండగ సందర్భంగా మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో సోమవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత స్థానిక ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి భక్తజనం నడుమ లాగారు. భక్తులు జైశ్రీరామ్ అంటూ పెద్దఎత్తున నినదించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కర్రే ఆధారం.. విరిగితే ప్రమాదం..



కర్ర సాయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు

కుందుర్పి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానిపల్లిలోని చెరువుకట్ట సమీపాన 20 కుటుంబాలు నివసిస్తున్నాయి. అక్కడ విద్యుత్ స్థంభం లేకపోవడంతో ఆ కాలనీ వాసులు కర్రనే కరెంటు స్తంభంగా ఏర్పాటు చేసుకుని గృహాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. అయితే కర్ర విరిగితే ప్రమాదం పొంచి వుందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. కర్ర ఇప్పటికే పుచ్చు పట్టి ఉందని, అది అప్పుడో.. ఇప్పుడో విరిగేలా ఉందని వాపోతున్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రమాదాలు జరగకముందే స్తంభం ఏర్పాటు చేసి వీధిలైట్లును ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గుత్తిరూరల్ మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామశివారులో గల పేకాటస్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. అందులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి రూ.5,210 నగదును స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం దాడులు చేశామని పేర్కొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే రాక

పుట్లూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించే పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రానున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపాయి. పింఛన్ల పంపిణీ అనంతరం గ్రామశివారులో వెలసిన బాట సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభించనున్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. కృష్ణాపురంలో ఉద్రిక్తత

బొమ్మనహాళ్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) మండలంలో కృష్ణాపురం గ్రామంలో ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన చిన్న పాటి గొడవ ఇరువర్గాల మధ్య పెద్ద ఘర్షణకు దారి తీసింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, తిప్పయ్య మరికొందరు కలిసి సోమవారం సాయంత్రం జూదం ఆడుతున్నారు. దీంతో తిప్పయ్య ఈశ్వర్‌రెడ్డికి రూ. 1000 అప్పు పడ్డాడు. గెలిచిన సొమ్ము ఇవ్వాలని ఈశ్వర్‌రెడ్డి గట్టిగా నిలదీయడంతో తిప్పయ్య ఆగ్రహానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకొంది. దీంతో తిప్పయ్య తరఫున గ్రామానికి చెందిన ప్రభాకర్ వచ్చి ఈశ్వర్‌రెడ్డితో గొడవ పడ్డాడు. కులం పేరుతో, కుటుంబ సభ్యులపై దూషణలు చేయడంతో ప్రభాకర్‌పై ఈశ్వర్‌రెడ్డి వర్గీయులు దాడికి దిగారు. దీంతో ప్రభాకర్ కూడా గొడవకు తన బంధు వర్గానికి పిలిపించుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు వచ్చి గొడవ పడిన వారిని బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి గొడవపై విచారణ చేస్తామని సీఐ పేర్కొన్నారు.

ఘనంగా పూర్ణానందస్వామి ఆరాధనోత్సవాలు



అలంకరణలో పూర్ణానందస్వామి

ఉరవకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కణేకల్లు రోడ్డులో గల భువనేశ్వరిదేవి ఆలయంలో పూర్ణానంద స్వామి ఆరాధనోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే స్వామి వారి పాలరాతి విగ్రహానికి అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు సోముశేఖర్, రమేష్, వేణు, బసవరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళాల వెల్లువ



విరాళం అందించి రసీదు పొందుతున్న భక్తులు

కూడేరు, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జోడు లింగాల సంగమేశ్వర స్వామి నూతన రథం తయారీకి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సోమవారం స్థానికులైన నూతనపాటి సంగన్న రూ. 50,116, బండారు రామరావు రూ. 50,116, మద్దినేని వెంకటనాయుడు రూ. 25,116, కొత్తపల్లి లింగమయ్య రూ.25,116, బుక్కచర్ల నల్లప్ప రూ. 25,116, బాట వెంకటేశులు రూ. 25,116, బాట నారాయణ రూ. 25,116, బాట సదాశివయ్య రూ. 25,116, ఓరుగంటి శివశంకర్ రూ. 25,116, కొత్తపల్లి ధనుంజయ రూ. 12,500 చొప్పున నగదును ఆలయంలోని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అలాగే గత వారం ఈడిగ తులసీ రూ. 25,116, శ్యామలమ్మ రూ. 25,116తోపాటు పలువురు భక్తులు విరాళాలు అందజేశారు.

అక్క దేవతలకు ప్రత్యేక పూజలు



పూర్ణకుంభాలు, జ్యోతులతో వస్తున్న భక్తులు

కుందుర్పి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తరపల్లిలో వెలసిన అక్కదేవతల ఆలయం వద్ద ఉగాది సందర్భంగా సోమవారం జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు తొలుత ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఆలయం ఎదుట ప్రాంగణంలో భారీ భక్తజనం నడుమ ఉత్సవమూర్తులకు విశేష పూజలు జరిపి, ఊయల సేవ నిర్వహించారు. తర్వాత వందలాదిమంది భక్తులు పూర్ణకుంభాలతో, జ్యోతులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేపట్టారు. అనంతరం వాటిని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ సందర్భంగా మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో సోమవారం పేద ముస్లిం మహిళలకు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ డైరెక్టర్ మహేంద్ర చీరలు పంపిణీ చేశారు. వందమందికి పైగా చీరలు పంపిణీ చేసినట్లు టీడీపీ యువనాయకుడు మున్నా తెలిపారు. నాయకులు నవీన్, హనుమంతు, సంగప్ప, శీనా పాల్గొన్నారు.

వైభవంగా అక్కమాంబ జాతర

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కొలిచిన భక్తుల కొంగు బంగారంగా పట్టణంలోని అక్కమాంబ అమ్మవారు విరాజిల్లుతున్నారు. ప్రతిఏడాది ఉగాది పండుగ మరుసటి రోజున స్థానిక ఆలయం వద్ద భక్తులు ఎంతో వైభవంగా అమ్మవారి జాతరను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారికి పూజారులు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసాలతో బిందెల్లో పానకాలు తీసుకొచ్చి సమర్పించి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.. ప్రతి ఏటా పానకాలతో మొక్కుబడులు తీర్చుకునే వారి సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచే గాక కర్ణాటక నుంచి సైతం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. సంతానం లేనివారు సమీపంలోని కొండపైకి వెళ్లి అమ్మవారి కొలనులో ప్రత్యేక పూజలు చేశారు. ఇలా చేస్తే కోరిక తప్పక నెరవేరుతుందనేది భక్తుల విశ్వాసం. మూడు రోజులపాటు ఈ జాతరను అత్యంత వైభవంగా జరుపుతారు. భక్తులకు భోజన సదుపాయాలు, నీటి సౌకర్యాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ సారి అక్కమాంబ జాతర కనువిందుగా సాగింది.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం: పట్టణంలో అక్కమాంబ జాతర సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించారు. సోదరుడు అమిలినేని ఎర్రిస్వామితో కలిసి సాంప్రదాయ దుస్తులు ధరించి పట్టువస్త్రాలు సమర్పించారు. అక్కమాంబ ఆలయ కమిటీ చైర్ పర్సన్ పద్మావతి, ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పట్టువస్త్రాలు సమర్పించిన తర్వాత ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎస్ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ప్రారంభించారు. రక్తదాతలు ఏర్పాటు చేసిన ఉచిత మొక్కల పంపిణీని కూడా ప్రారంభించారు. అక్కమాంబ ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే అమిలినేని



అక్కమాంబ జాతరలో భారీగా పాల్గొన్న భక్తజనం

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

కణేకల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని గరుడచేడు గ్రామంలో ఆదివారం రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో ఎనిమిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.12 వేలు, రెండో బహుమతి రూ. 8 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు ప్రకారం గ్రామస్థులు విజేతలకు అందించారు. రంగాపురం గ్రామానికి చెందిన అనిల్ ఎద్దులు 15 నిమిషాలలో 900 మీటర్ల మేర రాతిదూలాన్ని లాగి మొదటి బహుమతి సాధించాయి.



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు